సాక్షి
నంద్యాల
బుధవారం । 20 । డిసెంబర్ । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నకు, శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు పూజలు నిర్వహించి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు.



అన్నదాన పథకానికి విరాళం

మహానంది: మహానంది దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన అగ్రసేని సంస్థ అధినేత జీకే సింగ్ రూ. 2,50,000 విరాళంగా అందజేశారు.



'ఉమ్రా'తో మక్కా దర్శన భాగ్యం

పవిత్ర మక్కా, మదీనాల దర్శనం హజ్ యాత్ర సమయంలో లభిస్తుంది. ఇప్పుడు ఉమ్రా యాత్ర సమయంలో కూడా పలువురు వాటిని దర్శించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ▸ 8లో

న్యూస్‌రీల్

అహోబిలంలో వైభవంగా ధనుర్మాస పూజలు


ప్రత్యేకాలంకరణలో గోదాదేవి అమ్మవారు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి సహిత శ్రీ ప్రహ్లాద వరదస్వామితోపాటు శ్రీ గోదాదేవి అమ్మవారిని వేద పండితులు యాగశాలలో కొలువుంచి నవ కళశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తి గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక గుడిలో కొలువైన మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిదికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. సాయంత్రం ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ పాశురం ఉత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

నంద్యాలటౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా గురువారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959224885కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు,సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

రేపటి నుంచి నిపుణుల కమిటీ ప్రాజెక్టుల సందర్శన

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ నిపుణుల కమిటీ గురువారం జిల్లాకు రానున్నట్లు జిల్లా జలవనరుల శాఖ అధికారి వెంకటరమణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ పాండ్యాన్ నేతృత్వంలోని 10 మంది సభ్యుల బృందం ముందుగా బుధవారం కర్నూలు జిల్లాలోని సుంకేసుల ప్రాజెక్టును పరిశీలిస్తారు. అనంతరం 21వ తేదీ నంద్యాల జిల్లాలోని వెలుగోడు, 22వ తేదీ అలగనూరు జలాశయాలను సందర్శిస్తారు. డ్యాం రీహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) కింద చేసే ఈ పరిశీలనల్లో జలాశయాల ప్రస్తుత స్థితిగతులు, అవసరమైన మరమ్మతులు, కేటాయించాల్సిన నిధులు తదితర అంశాలపై ప్రభుత్వానికి సవివరమైన నివేదికను అధికారులు ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా ప్రపంచ బ్యాంకు నిధులు పొందే విషయంలో ప్రభుత్వం అంచనాకు వచ్చే అవకాశం ఉంది.

ఎడమగట్టు కేంద్రంలో స్వల్ప విద్యుదుత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో సోమవారం నుంచి మంగళవారం వరకు 0.484 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 956 క్యూసెక్కుల నీటిని వదిలారు. అలాగే బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,013 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 54.2498 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 834.30 అడుగులకు చేరుకుంది.

విద్యార్థీ.. అందుకో ట్యాబ్



- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- 21వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభం
- బైజూస్ కంటెంట్ ఇన్‌స్టాల్
- ఆనందంలో విద్యార్థులు


ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ట్యాబ్‌లతో విద్యార్థినులు (ఫైల్)

సాక్షి, నంద్యాల: విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణల ఒరవడి కొనసాగుతోంది. గతేడాది చేసిన ప్రయోగానికి సత్ఫలితాలు రావడంతో అదే మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నాడు-నేడుతో సర్కారు బడులను తీర్చిదిద్దుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే క్రమంలో దశల వారీగా డిజిటల్ మయం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా చర్యలు చేపట్టారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా వినూత్నమైన డిజిటల్ బోధనను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం పాఠశాలలను స్మార్ట్‌గా మార్చేస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో లేని విధంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేలను (ఐఎఫ్‌పీ) ప్రభుత్వ పాఠశాలలకు అందజేసింది. దీంతో ఉపాధ్యాయులు డిజిటల్ విధానంలో బోధన సాగిస్తున్నారు. ఇదే క్రమంలో వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ట్యాబ్‌లలో బైజూస్ డిజిటల్ కంటెంట్ ఉంటుంది. దీంతో ఎక్కడ నుంచైనా విద్యార్థులు, ఆడియో, వీడియో గ్రాఫిక్ ఎలిమెంట్స్ ద్వారా పాఠాలను నేర్చుకునే అవకాశం కలుగుతోంది. గతేడాది నంద్యాల జిల్లాలో 17,821 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు, 2,909 మంది ఉపాధ్యాయులకు కలిపి మొత్తం 20,730 ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ విద్యా సంవత్సరం జిల్లాలో 18,544 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసేలా అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆర్జేడీ కార్యాలయాలకు చేరుకున్న ట్యాబ్‌లను జిల్లాకు పంపేందుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలానికి సంబంధించి ఎంఈఓలకు వీటిని అందజేయనున్నారు. ట్యాబ్‌ల పంపిణీ, మెయింటెనెన్స్‌ను పర్యవేక్షించేలా నోడల్ అధికారులను ఏర్పాటు చేశారు. ఒకవేళ ట్యాబ్‌ల స్క్రీన్ పాడయితే ప్రభుత్వమే మరమ్మతులు చేయించేలా ఏర్పాట్లు చేసింది.

జిల్లాకు మంజూరైన ట్యాబ్‌ల వివరాలు

నియోజకవర్గం	ట్యాబ్‌లు
నంద్యాల	2,279
ఆళ్లగడ్డ	3,238
నందికొట్కూరు	3,183
డోన్	2,932
శ్రీశైలం	2,710
బనగానపల్లె	3,200
పాణ్యం	1,012
మొత్తం	18,554

నిరంతర పర్యవేక్షణ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్న ట్యాబ్‌లలో ఈ - పాఠశాల, డిక్షనరీతో పాటు బైజూస్ కంటెంట్ అందుబాటులో ఉంటుంది. కేవలం విద్యకు సంబంధించిన వీడియోలు మాత్రమే విద్యార్థులకు అందులో ఉంటాయి. సబ్జెక్ట్ నిపుణులతో చేయించిన షార్ట్ వీడియోలు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ ట్యాబ్‌లను ఉపాధ్యాయుల నుంచి డీఈఓ స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ పర్యవేక్షిస్తుంటారు. డిజిటల్ అసిస్టెంట్లు ప్రతి నెలా పాఠశాలలను సందర్శిస్తూ ట్యాబ్‌ల పనితీరును చెక్ చేస్తుంటారు.

8,9,10 తరగతుల సిలబస్ నిక్షిప్తం



గతేడాది అందజేసిన ట్యాబ్‌లలో 8, 9వ తరగతులకు సంబంధించిన బైజూస్ కంటెంట్ మాత్రమే నిక్షిప్తం చేసి ఇచ్చారు. ఈ ఏడాది నుంచి 10వ తరగతికి సంబంధించిన కంటెంట్‌ను చేర్చనున్నారు. 8వ తరగతి విద్యార్థి 10వ తరగతి కంటెంట్‌ను కూడా తెలుసుకునేందుకు ఇది తోడ్పడనుంది. 21వ తేదీ నుంచి ట్యాబ్‌లను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - సుధాకర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, నంద్యాల

సబ్జెక్టుల్లో అనుమానాలను నివృత్తి చేసుకుంటాం



ఇప్పటి వరకు ఇంటి దగ్గర చదువుకునే సమయంలో ఏమైనా డౌట్స్ ఉంటే మరుసటి రోజు స్కూల్‌కు వచ్చి సార్‌ని అడిగి నివృతి చేసుకునేవాళ్లం. ఇక నుంచి ట్యాబ్‌లు ఇస్తుండటంతో అందులో వెతికి వెంటనే క్లారిఫై చేసుకుంటాం. మరో నాలుగు రోజుల్లో మాకు ట్యాబ్‌లు ఇస్తుండటంతో చాలా ఆనందంగా ఉంది. - నాగచైతన్య, 8వ తరగతి, కేఎస్ఎం మున్సిపల్ పాఠశాల, నంద్యాల

బాగున్నాయని సీనియర్లు చెబుతున్నారు



పోయినేడాది మా సీనియర్లకు ట్యాబ్‌లు ఇచ్చారు. ఆ సమయంలో మాకు ఇస్తే బాగుంటుంది అనుకున్నాం. ఇప్పుడు ఇస్తారని చెబుతుంటే ఆనందంగా ఉంది. ట్యాబ్‌లు చాలా బాగున్నాయని చెప్పారు. మా క్లాస్‌తో పాటు 9, 10వ తరగతుల సబ్జెక్ట్‌ల కంటెంట్ అందుబాటులో ఉంటుందని అంటున్నారు. ట్యాబ్‌లు ఇస్తే మాకెంతో ఉపయోగపడతాయి. - తస్నీమ్, 8వ తరగతి, కేఎస్ఎం పాఠశాల, నంద్యాల

ఇంగ్లిష్‌లో మాట్లాడగలుగుతున్నా..



ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లలో మా క్లాస్‌కు సంబంధించిన సిలబస్ అంతా ఉంది. ఈ - పాఠశాల యాప్ ద్వారా అన్ని డౌట్స్ క్లియర్ చేసుకుంటున్నాం. ఇంగ్లిష్ నేర్చుకుని చక్కగా మాట్లాడగలుగుతున్నా. మాకు 8, 9వ తరగతి కంటెంట్‌తోనే ట్యాబ్‌లు ఇచ్చారు. ఈ ఏడాది 10వ తరగతి కంటెంట్ కూడా చేరుస్తుండడం చాలా ఉపయోగపడుతుంది. - వస్నూరు, 9వ తరగతి, చాపిరేవుల

ఆడుదాం ఆంధ్ర పోటీలపై దృష్టి సారించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా కీడాప్రాధికార సంస్థ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్ పూర్తి కావడంతో టీంల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే గుర్తించిన క్రీడా మైదానాలను స్వాధీనం చేసుకుని అందులో కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఏ సచివాలయం టీం..ఏ గ్రౌండ్‌లో ఏ రోజునా ఆడాలో వివరాలతో కూడిన షెడ్యూల్‌ను రూపొందించాలన్నారు. ఈ ప్రక్రియలను రెండు, మూడు రోజుల్లో ముగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా పోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలు ఇంకా అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి క్రీడా పోటీల నిర్వహణ ప్రదేశాల్లో షామియానా, ఆరోగ్య వైద్య శిబిరాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు ఒకటి, రెండు రోజుల్లోనే జమ అవుతాయన్నారు. సమావేశంలో డీపీఓ మంజులవాణి, డీఎల్‌డీఓ కల్యాణి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల పరిపాలనలో ఏమి చేశారు?

- కోట్ల, కేఈలపై మండిపడిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన
- నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సవాల్
- టీడీపీ నేతల దోపిడీని ప్రజలు ఇంకా మరవలేదు


కన్నపకుంట - కమలాపురం రహదారిపై పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన


కమలాపురంలో రైతుభరోసా కేంద్రం ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

డోన్: జిల్లా రాజకీయాలను 50 ఏళ్ల పాటు ఏకఛత్రాధిపత్యంగా నడపడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవులు పొందిన నేతలు డోన్ నియోజకవర్గానికి చేసిందేమిటని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పరోక్షంగా కేఈ, కోట్లలపై మండిపడ్డారు. నియోజకవర్గానికి ఏమి చేశారో ప్రజలకు ఇప్పటికైనా చెప్పాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ నిధులను దోచుకున్న టీడీపీ నేతలు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హతలేదని విమర్శించారు. మండలంలో కన్నపకుంట నుంచి కమలాపురం గ్రామం వరకు రూ.3కోట్లతో నిర్మించిన మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డును మంత్రి బుగ్గన మంగళవారం ప్రారంభించారు. అనంతరం కన్నపకుంట నుంచి పాదయాత్రగా కమలాపురం గ్రామం చేరుకుని రూ.35.5 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.25 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కుల, మత బేధాలు లేకుండా అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందిస్తున్నామన్నారు. గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.రూ.350 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి సంక్రాంతి నాటికి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. ఇప్పటికే రూ.251 కోట్లతో హంద్రీనీవా నీటిని నియోజకవర్గంలోని 36 చెరువులకు మళ్లించామన్నారు. రూ.40 కోట్లతో నిర్మించిన వంద పడకల ప్రభుత్వాసుపత్రిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. డోన్‌లో వడ్డెర, కాపు భవన్‌లతో పాటు బేతంచెర్లలో వాల్మీకి భవన్‌లను నిర్మించిన సంగతిని ఆయన గుర్తుచేశారు.

హామీలతో మోసం చేయడం చంద్రబాబు నైజం

అధికారం కోసం ఎన్నికల ముందు హామీలివ్వడం ఆ తర్వాత ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని మంత్రి బుగ్గన విమర్శించారు. పూటకో బూటకపు వాగ్దానం చేస్తున్న టీడీపీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. టీడీపీ నాయకులు దొంగ పాస్ పుస్తకాలు సృష్టించి బ్యాంకులను మోసం చేయడం, గృహనిర్మాణం పేరుతో అర్హులైన వారి రేషన్‌కార్డులను తీసుకొని అక్రమంగా ప్రభుత్వ రుణాలను తీసుకోవడం వాస్తవం కాదా.. అని మంత్రి ప్రశ్నించారు. మరుగుదొడ్ల బిల్లులు సైతం పేదలకు చెల్లించకుండా పందికొక్కుల్లా మెక్కిన టీడీపీ నాయకుల గురించి ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఊళ్లో సర్పంచుగా కూడా గెలవలేని వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుస్తానని ప్రగల్భాలు పలుకుతుండటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. డోన్ టీడీపీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారనే స్పష్టత లేని వ్యక్తులు కూడా తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, కల్యాణి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బొబ్బల శివరామిరెడ్డి, బుగ్గన జయచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రమౌళేశ్వరరెడ్డి, డోన్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్, ఆహార సలహామండలి చైర్మన్ చంద్రన్న యాదవ్, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మదన్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామితో పాటు అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దవారికి బీసీజీ టీకా

- నంద్యాల జిల్లాలో ట్రయల్ రన్
- మొదట గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యం


బీసీజీ వ్యాక్సిన్

కర్నూలు(హాస్పిటల్): క్షయవ్యాధిని నిర్మూలించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇందులో భాగంగా పెద్దవారికి బీసీజీ వ్యాక్సిన్ వేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో నంద్యాల గిరిజన ప్రాంతాన్ని ప్రాధాన్యతగా ఎంచుకుంది. ఇప్పటికే జిల్లాకు 14వేల బీసీజీ వాయిల్స్, 2,34,000 సిరంజిలు కూడా పంపింది. వీటిని కర్నూలులోని జిల్లా ఇమ్యునైజేషన్ కేంద్రంలో భద్రంగా ఉంచారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వాటిని గిరిజన ప్రాంతాలకు తరలించి వ్యాక్సిన్ వేయనున్నారు. 8 సంవత్సరాలు పైబడిన వారికి వీటిని వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడానికి గత ఐదేళ్లలో టీబీ వ్యాధికి గురైన వారు, 2021 జనవరి ఒకటి తర్వాత టీబీ వ్యాధి సోకినా, ఇంట్లో ఎవ్వరికైనా వచ్చినా, 60ఏళ్లు దాటిన వారు, గతంలో కానీ ఇప్పుడు గానీ పొగ తాగే అలవాటు ఉన్న వారు, మధుమేహంతో బాధపడుతున్న వారు, బాడీ మాక్స్ ఇండెక్స్(ఎంబీఐ) 18 కన్నా తక్కువ ఉన్న వారికి ఈ వ్యాక్సిన్ వేస్తారు.

సంక్షేమ బావుటా

సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 4 లక్షలు ఇచ్చారు



ఆపదలో పేదలను ఆదుకునేవాళ్లు దేవుడితో సమానం. జగనన్న ప్రభుత్వంలో పేదల వైద్యానికి ఏ లోటు లేదు. నాకు రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో ప్రాణాలపై ఆశలు వదులుకున్నా. నా భార్య మహేశ్వరమ్మ కిడ్నీ దానం చేయడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. వైద్యుల సూచన మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నా. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 4 లక్షలు చెక్ రూపంలో సెప్టెంబర్ నెలలో అందుకున్నాను. అలాగే అక్టోబర్ నెల నుంచి పెన్షన్ రూ. 5 వేలు వస్తోంది. ప్రతి నెల 1వ తేదీన గ్రామ వలంటరీ ఇంటి వద్దకు వచ్చి అందజేస్తుంది. గతంలో డయాలసిస్ చేయించుకోవడానికి ఎన్నో పాట్లు పడేవాళ్లం. నేడు జగనన్న ప్రభుత్వంలో కిడ్నీ రోగులకు ఉచితంగా వైద్యం అందుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలును మరచిపోలేం. ఆయనకు మా కుటుంబం రుణపడి ఉంటుంది. - మల్కిరెడ్డి దస్తగిరిరెడ్డి, గోవిందపల్లె, ఉయ్యాలవాడ మండలం

జగన్ సార్ వందేళ్లు చల్లగా ఉండాలి



పేదల కోసం సీఎం వైఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నారు. బడి పిల్లల నుంచి ముసలోళ్ల వరకు ఏదో విధంగా అండగా నిలుస్తున్నారు. పేదల సమస్యలు తెలుసుకున్న నాయకుడు కాబట్టి మంచి మంచి పథకాలు ప్రజలకు అందిస్తున్నారు. నా భర్త పూజల శివయ్య రెండేళ్ల క్రితం చనిపోయాడు. ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ. లక్ష ఇచ్చింది. చిన్ని చిన్న అప్పులు కట్టేసి, మిగిలిన డబ్బుతో అరిటాకులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాను. నెలనెలా నాకు వితంతు పింఛన్ వస్తోంది. పేదలకు మేలు చేసే జగన్ సారు వందేళ్లు చల్లగా ఉండాలి. - పూజల లక్ష్మీదేవి, గాజులపల్లె గ్రామం, మహానంది మండలం

భూములు కోల్పోయే ప్రతి రైతుకూ న్యాయం

- త్రీజీ అవార్డు విచారణలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: నంద్యాల- జమ్మలమడుగు నేషనల్ హైవే రోడ్డు విస్తర్ణలో భూములు, స్థలాలు కోల్పోయే ప్రతి రైతుకు న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జేసీ అధ్యక్షతన త్రీజీ అవార్డ్ విచారణ చేపట్టారు. నేషనల్ హైవే 167కే జాతీయ రహదారి విస్తరణలో కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు గ్రామానికి సంబంధించి 15.08 ఎకరాలు, ఎం. ఉప్పలూరులో 8.9, కలుగొట్లలో 27.66, జోళదరాశిలో 28.55, చింతకుంట్లలో 20.66, కోవెలకుంట్లలో 39.66, పొట్టిపాడులో 11.77, గుళ్లదుర్తిలో 42.63 ఎకరాల్లో రైతులు భూములు, స్థలాలు, ఇళ్లు, తదితర ఆస్తులు కోల్పోతున్నారు. ఈ భూములకు సంబంధించి డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, వన్‌బీ, ఈసీ, బ్యాంకు ఖాతా, అధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, తదితర వివరాలను ఆయా గ్రామాల రైతులు త్రీజీ అవార్డు విచారణలో అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నోటిఫికేషన్‌కు ముందు మూడు సంవత్సరాల కాలంలో ఆస్తుల లావాదేవీలను పరిగణలోకి తీసుకుని ఆస్తుల మార్కెట్ విలువ, లావాదేవీల సగటు విలువను లెక్కించి నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. నిర్ధేశించిన మొత్తానికి రెండున్నర వంతు పెంచి పరిహారం అందజేస్తామన్నారు. భూములకు సంబంధించి మార్కెట్ విలువ కంటే ఎక్కువ మొత్తం విలువ చేస్తుందని భావిస్తే మౌఖికంగా కాకుండా ఆ విలువకు సంబంధించిన డాక్యుమెంట్లు జత చేయాలని సూచించారు. జాతీయ రహదారిలో భూములు కోల్పోయే రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ పుష్పకుమారి, మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, అర్ఐ ఇమ్రాన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదోని సబ్ కలెక్టర్‌గా శివనారాయణ్ శర్మ

ఆదోనిరూరల్: ఆదోని నూతన సబ్ కలెక్టర్‌గా శివనారాయణ్ శర్మను ప్రభుత్వం నియమించింది. 2021వ బ్యాచ్‌కు చెందిన ఇతను శిక్షణ పూర్తి చేసుకోగా మొదటి పోస్టింగ్ ఆదోని సబ్ కలెక్టర్‌గా వచ్చింది. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న అభిషేక్ కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పంపారు. కాగా అభిషేక్ కుమార్ దాదాపు ఏడాదికి పైగా ఇక్కడ పనిచేశారు.

రగ్బీ విజేత లక్ష్మీపురం కేజీబీవీ జట్టు



నగదు బహుమతి అందుకుంటున్న లక్ష్మీపురం కేజీబీవీ జట్టు

కర్నూలు (టౌన్) : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న అండర్–18 ఖేలో ఇండియా మహిళల లీగ్ పోటీల్లో లక్ష్మీపురం కేజీబీవీ పాఠశాల జట్టు విజేతగా నిలిచి రూ. 50 వేలు బహుమతి అందుకుంది. రెండో స్థానంలో కంబాలపాడు ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ జట్టు నిలిచి రూ. 30 వేలు, మూడవ స్థానంలో దిన్నెదేవరపాడు ఏపీ ఎస్ డబ్ల్యూ జట్టు నిలిచి రూ.20 వేలు అందుకున్నట్లు ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు వెల్లడించారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు ఒడిశాలోని లోని భువనేశ్వర్‌లో జరిగే 67వ జాతీయ స్థాయి అండర్–14 రగ్బీ పోటీల్లో సత్తా చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏపీ రగ్బీ జట్టును అభినందించి మాట్లాడారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రానికి పతకాలు తీసుకురావాలన్నారు. జట్టుకు మేనేజర్, కోచ్‌లుగా శ్రీకాంత్, ఎస్. కవిత, శేషుకుమారి వ్యవహరిస్తారని వెల్లడించారు.

టీడీపీ నాయకుడి నిలదీత



టీడీపీ నాయకుడు రామకృష్ణ (తెల్ల చొక్కా వ్యక్తి) ను నిలదీస్తున్న కాలనీవాసులు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణను ఆ కాలనీవాసులు మంగళవారం నిలదీశారు. వారం రోజుల క్రితం కాలనీల్లో టీడీపీ నాయకులు ఇంటింటి తిరిగి ప్రజల ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ తీసుకొని సెంటున్నర స్థలం ఇస్తామని నమ్మించారు. కాని స్థలం ఎక్కడో చూపించకపోవడంతో కాలనీవాసులు టీడీపీ నాయకుడి రామకృష్ణను సెంటున్నర స్థలం ఎక్కడ ఇస్తారని నిలదీశారు. తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకున్నావని, ఏదైన నష్టం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని కాలనీవాసులు పక్కీరమ్మ, పార్వతమ్మ, నారాయణమ్మ, మధుసూదన్‌రెడ్డి, కృష్ణమూర్తి, వేణుగోపాలు వలిబాషా, వార్డు కౌన్సిలర్ నాగజ్యోతి హెచ్చరించారు.

‘ఉమ్రా’తో మక్కా దర్శన భాగ్యం

- మహమ్మద్ ప్రవక్త నుంచి ఆరంభమైన పుణ్య కార్యం
- యాత్రలో మక్కా, మదీనా, ప్రవక్తలు నడయాడిన ప్రాంతాలు చూసే భాగ్యం
- ఇటీవల కాలంలో పెరిగిన యాత్రికులు
- ప్యాకేజీ టూర్‌లతో యాత్రలు చేయిస్తున్న ప్రైవేటు ఏజెన్సీలు
- ‘ఐఏటీఏ’ గుర్తింపు సంస్థలతో వెళ్తే మేలంటున్న మౌల్వీలు



పవిత్ర మక్కాలోని కాబా ఉన్న మసీదు

కర్నూలు(రాజ్‌విహార్):పవిత్ర ‘మక్కా’ను సందర్శించాలన్నది ప్రతి ముస్లిం కోరిక. అక్కడ అల్లాహ్ ప్రత్యక్ష సహకారంతో ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా నిర్మించిన ‘కాబాతుల్లా’ చూడాలని, దీని చుట్టూ ప్రదక్షిణలు చేయాలని, మజ్జీద్ ఏ హరాంలో నమాజ్ చేయాలని కోరుకుంటారు. అలాగే మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా (సా.అ.వ) చివరి ప్రాంతం మదీనాను సందర్శించాలని ఆశిస్తుంటారు. హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు పైవన్నీ దక్కుతాయి. అయితే, ప్రస్తుతం ఉమ్రాకు వెళ్లే వారు పవిత్ర మక్కా, మదీనాల దర్శనానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్తున్న యాత్రికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

మక్కా యాత్ర రెండు రకాలు

పవిత్ర పుణ్య క్షేత్రం మక్కా యాత్రకు రెండు రకాలుగా వెళ్తారు. ఇందులో మొదటిది, ముఖ్యమైనది హజ్ యాత్ర. బక్రీద్ సమయంలో మక్కా సమీపంలోని అరఫత్ మైదానంలో ఉన్న నిమ్రా మసీదు (2లక్షల మంది సామర్థ్యం)లో బక్రీద్ నమాజ్ చేయడంతో పాటు పలు నియమ నిబంధనలతో ప్రార్థనలు చేస్తే హజ్ పూర్తవుతుంది. ఇది 40 రోజుల యాత్ర. అల్లాహ్ సూచించిన ఇస్లాం ధర్మ సూత్రాల్లో ఇది ఒకటి. పంచ నియమాలను పవిత్ర గ్రంథం ఖురాన్‌లో అల్లాహ్ సూచించారు. అవే ఈమాన్, రోజుకు ఐదు పూటల నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర. ఆర్థిక శక్తి ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒకసారైనా హజ్ చేయాలని ‘ఫరజ్’ (తప్పని సరిగా చేయాలని)గా ప్రస్తావించారు. రెండోది ఉమ్రా. బక్రీద్‌తో పాటు ఇతర సమయాల్లో మక్కా వెళ్లి చేసుకునే ప్రత్యేక ప్రార్థననే ఉమ్రా అంటారు.

ప్రవక్త నుంచే ఉమ్రా ఆరంభం

మక్కా నుంచి మదీనా వెళ్లిపోయిన మహమ్మద్ ప్రవక్త కొంత కాలం తరువాత ఉమ్రా కోసం సహచరులతో మక్కా వస్తారు. అయితే, కాబాను ఆధీనంలో పెట్టుకున్న పాలకులు నగర బయటే ఆయనను అడ్డుకుంటారు. ఆ సమయంలో వారితో చర్చలు జరిపి, వాళ్లు పెట్టిన షరతులన్నింటినీ ఒప్పుకుంటారు. అయితే వాటికి ఒప్పుకోవద్దని సహచరులు చెప్పినా వినరు. ఆ తరువాత ఆయన ఖుర్బానీ ఇచ్చి, ఉమ్రా చేశాక తీయాల్సిన తలనీలాలను తనకు తానే తీసి గుండు చేసుకుని వెనక్కి వెళ్తారు. అలా ఉమ్రా మొదలైంది.

2007 నుంచి ప్రాచుర్యం

గతం హజ్ యాత్రకు వెళ్తే ఉమ్రా కూడా చేసుకునే వాళ్లు. ప్రత్యేకించి వెళ్లే వాళ్లు కాదు. అయితే, ప్రవక్త ఆచరించిన ఉమ్రా 2007లోకి వెలుగులోకి రావడంతో అప్పటి నుంచి మక్కా వెళ్లే వారి సంఖ్య ప్రారంభమై, క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రోజుకు 70వేల మందికి సౌదీ అరేబియా దేశం వీసాలు జారీ చేస్తోంది. మక్కా, మదీనాలోని మసీదుల్లో ప్రతి రోజు సగటున ఐదారు లక్షల మంది నమాజ్, తవాఫ్, దరూద్ ప్రార్థనలు చేస్తుంటారు. ప్రవక్త ఆచరించిన ఈ కార్యక్రమం హజ్‌కు వెళ్లే అవకాశం దక్కని వాళ్లు ఉమ్రాకు వెళ్తుంటారు. దీంతో ఆయా పవిత్ర ప్రాంతాల చరిత్ర, ప్రవక్తల ఘనతను తెలుసుకునే వీలు కలుగుతుంది.

జిల్లా నుంచి ఎలా వెళ్లాలంటే..

హైదరాబాదు (శంషాబాద్) ఎయిర్ పోర్టు నుంచి రెగ్యులర్‌గా విమానాలన్నాయి. మక్కా, మదీనా వెళ్లే ముందు సౌదీ అరేబియా వీసా (అనుమతి) పొందాలి. విదేశీ పర్యటనలకు తీసుకెళ్లే ఏజెన్సీలు, ఏజెంట్లు వీసాతో పాటు విమాన టికెట్లు బుక్ చేస్తారు. నేరుగా వెళ్లడం కంటే ఏదైనా ‘ఐఏటీఏ’ గుర్తింపు కలిగిన ఏజెంట్ ద్వారా వెళ్లడం మంచిది. దగ్గర ఉండి అన్ని నిబంధనలతో ఉమ్రా చేయిస్తారు. ముందుగా ఆ ఏజెంట్ సేవలను పూర్తిగా తెలుసుకోవాలి. లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలుంటాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మక్కా సమీపంలోని జిద్దాహ్ ఎయిర్ పోర్టుకు 4,132 కిలో మీటర్ల దూరం. సౌదీ ఎయిర్ లైన్స్ విమానాల్లో 4:30 గంటలు, ఇండిగో విమానాల్లో 6 గంటల వరకు ప్రయాణ సమయం పడుతుంది. ఎయిర్ పోర్టు నుంచి మక్కా 100 కిలో మీటర్లు. ట్యాక్సీ, లేదా బస్సుల్లో చేరుకోవచ్చు. ఇక్కడ ఉమ్రా, జియారత్, చూడదగిన ఆధ్మాత్మిక ప్రదేశాల సందర్శన కార్యక్రమాలు పూర్తయితే మదీనా వెళ్లవచ్చు. మక్కా నుంచి మదీనా 453 కిలో మీటర్ల దూరం ఉంది. బస్సు లేదా ట్యాక్సీల్లో వెళ్లవచ్చు.

ఉమ్రా చేయడం సున్నత్



హజ్ అల్లా చెప్పిన ఫరజ్. ఈ యాత్రకు వెళ్లేలేని వారు ఇటీవలే ఉమ్రాకు వెళ్తున్నారు. అయితే తప్పనిసరి కాదు. కానీ ప్రవక్త ఆచరించిన సున్నత్. ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం అల్లా ఇల్లు మక్కా, ప్రవక్త చివరి ప్రాంతం మదీనా చూసి దరూద్ పంపాల్సి ఉంది. ఈ యాత్రలు ఎంతో నియమ నిబంధనలతో పూర్తి చేయాలి.

– షేక్ ముఫ్తీ అబ్దుర్ రహ్మాన్ సాబ్. ఫౌండర్, దారుల్ ఉలూం ఐనుల్ హుదా మదరసా

మక్కా పర్యటన ఓ అద్భుతం



మక్కా పర్యటన చేయాలంటే అల్లా అనుగ్రహం ఉండాలి. ముందు మనం వెళ్లాలని నిర్ణయించుకుని పదేపదే దువా చేయాలి. అదో అద్భుత పర్యటన. జీవితంలో ఒకసారైనా చూడాలి. ఒకసారి వెళ్లిన వ్యక్తి మళ్లీ మళ్లీ రావాలని మక్కా, మదీనాలోనే అల్లాతో దువా చేసుకుంటారు.

– హాజి తాటిపాడు మహబూబ్ సాహెబ్, నందికొట్కూరు

23లోపు అసైన్డ్ దారుల వివరాల పరిశీలన పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): అసైన్డ్ భూములను 20 ఏళ్లగా సాగు చేసుకుంటున్న రైతుల వివరాలను సేకరించి పరిశీలించే ప్రక్రియను ఈనెల 23లోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అసైన్‌మెంట్ భూములు, రీసర్వే, ఆడుదాం ఆంధ్ర, ఓటర్ల జాబితా సవరణ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆర్ఓఆర్, పాత ఆర్ఓఆర్, ఆర్ ఎస్ఆర్, ఓల్డ్ అడంగళ్లలో ఎంట్రీ ఉంటే రుజువుగా పరిగణించాలని సూచించారు. ఇందుకు సంబంధించి చెక్ లిస్టును తయారు చేసి మండలాలకు పంపామని, దానిని పూర్తి చేసి నివేదించాలన్నారు. రీసర్వేకు సంబంధించి నెలఖారుకు ఫైనల్ ఆర్ఓఆర్ ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అర్జీలను ఒకటి, రెండు రోజుల్లో పరిశీలించాలన్నారు. జనవరి 5న తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి పాల్గొన్నారు.

నీటి ప్రవాహ ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించండి

కర్నూలు(సెంట్రల్): నీటి ప్రవాహ ప్రాంతాలైన వాగులు, వంకలు, చెరువుల, ఇతర నీటి వనరుల్లో ఆక్రమణలు తొలగిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆక్రమణలు తొలగింపు పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. మంగళవా రం ఈ అంశంపై జేసీ మౌర్యతో కలిసి మునిసిపల్ కమిషనర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డీఓలు,ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఇళ్లకు, వ్యవసాయం కోసం స్థలాలు ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చి జప్తు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలు రామలక్ష్మి, హరిప్రసాదు, ఇరిగేషన్ ఎస్ఈ శేఖర్‌రెడ్డి, డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, గూడూరు కమిషనర్ ప్రసాదగౌడు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కరుణసాగర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

మహానంది: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాయలం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్ అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం మూడవ విడత అంతర్ కళాశాలల క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల మక్కువ పెంచుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. రైతులకు సేవ చేయడంలో వ్యవసాయ విద్యార్థుల పాత్రం ఎంతో కీలకమన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ పీ.సాంబశివరావు మాట్లాడుతూ క్రీడలు సజావుగా జరగడానికి కళాశాలలో తగిన ఏర్పాట్లు చేశామని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మహానంది అసోసియేట్ డీన్ డాక్టర్ కే ఎస్ఎస్ నాయక్, కళాశాల ఓఎస్ఏ డాక్టర్ పీ. రమేష్ బాబు, ఆధ్యాపకులు డాక్టర్ ఎంఎస్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ సైన్స్ కళాశాలలకు చెందిన 527 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు క్రికెట్, ఫుట్‌బాల్ క్రీడా పోటీలు, అథ్లెటిక్స్ విభాగంలో 300 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్: భర్త వేధిపులు తాళలేక ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామానికి చెందిన మల్లేశ్వరికి ఎనిమిది సంవత్సరాల కిత్రం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన గుడ్డి ఈరన్నతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే, భర్త నిత్యం మద్యం తాగడంతో పాటు అనుమానంతో వేధించేవాడు. పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా, ఈరన్న పద్ధతి మార్చుకోకపోగా సోమవారం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె మనస్థాపం చెంది అదేరోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి తండ్రి కురవ భాస్కర్ ఫిర్యాదు మేరకు భర్త ఈరన్న, బావలు పెద్ద ఈరన్న, మల్లేష్, వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఏసీబీ వలలో నూతనపల్లె వీఆర్వో

- పట్టాదారు పాస్ బుక్ కోసం రూ.10 వేలు లంచం డిమాండ్



లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్ఓ విజయమ్మ

కర్నూలు (టౌన్): పొలం ఆన్‌లైన్ కోసం రైతుకు డబ్బు డిమాండ్ చేసిన నూతన పల్లె వీఆర్వో విజయమ్మను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఈ సంఘటన జరిగింది. మండల పరిధిలోని నూతనపల్లె గ్రామానికి చెందిన బొగ్గుల షేక్షావలి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో భూ వివరాలు ఎక్కించి పట్టాదారు పాస్ బుక్ ఇవ్వాలని విలేజీ రెవెన్యూ అధికారి విజయమ్మను కలిశారు. అయితే, ఇందుకు ఆమె రూ.10 వేలు డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో రైతు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం మంగళవారం బాధితుడు డబ్బు తీసుకెళ్లి కార్యాలయంలో వీఆర్వోకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నల్లమలగా మార్చేస్తాం

నంద్యాల(సిటీ): వన్యప్రాణులు ప్లాస్టిక్ బారి నుంచి పరిరక్షించడానికినాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతాలను వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించి చర్యలు చేపడుతున్నట్లు అటవీ సంరక్షణాధికారి, ఫీల్డ్ డైరెక్టర్ బీఎన్ఎన్ మూర్తి మంగళవా రం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచన లు,నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతాన్ని ఎకో సెన్సిటివ్ జోన్ నోటిఫికేషన్ 2021 ప్రకారం ప్లాస్టి క్ ఫ్రీ జోన్‌గా నిర్ణయించామన్నారు. ప్రజలు, ప్రయాణికులు, భక్తులు ఈ ప్రాంతాలలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను వినియోగించకుండా పేపర్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్ ఉపయోగించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుం కింద రూ.2,000 జరిమానా విధిస్తారన్నారు.

ముస్సిపల్ ఉద్యోగులమంటూ చోరీ

- 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.4 లక్షలు అపహరణ

బొమ్మలసత్రం: ముస్సిపాలిటీ ఉద్యోగులమని చెప్పి ఓ ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, నగదు దోచుకెళ్లిన సంఘటన నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల సమీపంలో ఓ ఇంట్లో రిటైర్డ్ లెక్చరర్ సుబ్బారెడ్డి దంపతులు నివసిస్తున్నారు. ప్రస్తుతం రామసుబ్బారెడ్డి స్థానిక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. సోమవారం రోజులాగే విధులకు వెళ్లారు. ఆయన భార్య ఒంటరిగా వంట చేస్తుండగా ముస్సిపాల్టీ ఉద్యోగులమని చెప్పి ఇద్దరు యువకులు ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటి కొలతలు, ఆధార్ కార్డులు కావాలని చెప్పడంతో మహిళ బీరువాలో ఉన్న ఇంటి పత్రాలు, గుర్తింపు కార్డులు తీసి ఇచ్చింది. పత్రాలు పరిశీలిస్తున్నట్లు వారు అక్కడే ఉండటంతో మహిళ వంట గదిలోకి వెళ్లిపోయింది. ఆ సమయంలో బయటి నుంచి మరో వ్యక్తి గదిలోకి వెళ్లి బీరువాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.4లక్షల నగదు అపహరించుకెళ్లారు. మహిళ వంటగదిలో నుంచి బయటికి రాగానే ముగ్గురు యువకులు అక్కడి నుంచి హడావుడిగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్ది సేపటి తర్వాత బీరువాలో వస్తువులు పడేసి ఉండటం గమనించి వెంటనే వెంటనే భర్తకు ఫోన్ చేసింది. సుబ్బారెడ్డి ఇంటికి చేరుకుని చోరీ జరిగిందని టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. స్థానిక ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలను మంగళవారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలసి కలెక్టర్ పరిశీలించారు. కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే గదులను పరిశీలించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు భవనాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. నంద్యాల జిల్లాకు మొత్తం 24 గదులను కేటాయించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయా గదులకు విద్యుత్, మౌలిక సదుపాయాలతో పాటు, నిఘా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆర్‌జీఎం, శాంతిరాం ఫార్మసీ కళాశాలను పరిశీలించారు. వారి వెంట జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎస్బీ డీఎస్పీ సంతోష్, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతుల అభ్యున్నతికి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి రైతుల అభ్యున్నతికి ఉద్యానశాఖ చర్యలు చేపట్టింది. ప్రధానంగా పంట ఉత్పాదకతను పెంచడంతో పాటు గిట్టుబాటు ధర కల్పించడం కోసం డిజిటల్ గ్రీన్ ఆర్గనైజేషన్‌తో కలసి పని చేస్తోంది. కర్నూలు జిల్లాలో మిర్చి, టమాట, నంద్యాల జిల్లాలో మిర్చి పంటపై ఆ సంస్థతో కలిసి వర్క్‌షాపులు నిర్వహిస్తుంది. తాజాగా డిజిటల్ గ్రీన్ ఈ–మిర్చా 2.0 ప్రాజెక్టును లాంచ్ చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామాంజనేయులు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఈప్రాజెక్టు ద్వారా మిర్చిలో ఉత్పాదకతను పెంచేందుకు ఏఏ దశల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలి.. చీడపీడలు, వాటి నివారణ, పోషకాల లోపాల నివారణ తదితర వాటిని రైతులకు వివరిస్తామన్నారు. మిర్చి రైతుల మొబైల్ నెంబర్లు సేకరించి.. వారితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి సాంకేతిక సమాచారం రైతులందరికీ అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సూర్య రాజేష్‌గౌడ్

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట గ్రామ శివార్లలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన సూర్య రామ్మూర్తిగౌడ్ దాదాపు 25 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం అల్ట్రాటెక్ ప్యాక్టరీలో స్థిరపడి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య రమణమ్మ, కూతురు, కొడుకు సంతానం ఉన్నారు. తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్‌కు చెందిన ఈసీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కుమారుడు అల్ట్రాటెక్‌కు చెందిన ఆదిత్యబిర్లా స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరి కుటుంబానికి ప్రభుత్వం తుమ్మలపెంట సమీపంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండటంతో పరిశీలించేందుకు కుమారుడు సూర్య రాజేష్ గౌడ్(16), తల్లి రమణమ్మ బైక్‌పై వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో నాపరాళ్ల లోడ్‌తో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా తల్లికి గాయాలయ్యాయి. రోడ్డుపై విగతజీవిగా పడిఉన్న కుమారుడిని చూసి తల్లి రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్ట్

- నాలుగు నాటు తుపాకులు, రెండు కత్తులు స్వాధీనం



వేటగాళ్ల అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ ఎఫ్ఆర్ఓ, సిబ్బంది

మహానంది: బండిఆత్మకూరు మండలం నారపురెడ్డి కుంట బీట్ సమీపంలోని బాలయ్యకుంట ప్రదేశంలోని నల్లమల అడవిలో వేటకు వెళ్లిన ఐదుగురు వన్యప్రాణుల వేటగాళ్లను అరెస్ట్ అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌జా తెలిపిన వివరాల మేరకు .. నారాయణాపురం, ఏ.కోడూరు గ్రామాలకు చెందిన మాచగొండ నాగరాజు, బండపల్లె చిరంజీవి, ఆలం ఫక్కీర్‌హుసేన్, పఠాన్ పెద్దమౌలాలి, షేక్ హుసేన్‌వలి నల్లమలలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు నాటుతుపాకులు, అందుకు వినియోగించే తొమ్మిది రవ్వలు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను వేటాడితే ఏడేళ్ల నుంచి జీవితాంతం జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. నల్లమలలో అనుమానాస్పదంగా తిరిగే వారిపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. నల్లమల సమీప గ్రామాల ప్రజలు వన్యప్రాణుల వేటగాళ్లపై 98855 09574కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో అటవీశాఖ డీఆర్ఓ నాగేంద్రనాయక్, ఎఫ్ఎస్ఓలు విజయలక్ష్మి, సుబ్బయ్య, తేజ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 87 గొర్రె పిల్లలు మృత్యువాత



మృతి చెందిన గొర్రె పిల్లలు

సంజామల: మండల కేంద్రం సంజామలలో కుక్కల దాడిలో దాదాపు 87 గొర్రె, పొట్టేళ్ల పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన వెంకటశివుడు జీవాల పెంపకం ఆధారంగా జీవిస్తున్నాడు. శివుడు సోమవారం సాయంత్రం ఊరి బయటున్న తన బల్లకంతలో గొర్రెపిల్లలను ఉంచి గొర్రెలను మేపుకోవడానికి వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చే సరికి బల్లకంతలో ఉన్న గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. దాదాపు రూ.5లక్షల విలువైన గొర్రె పిల్లలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మంగళవారం ఉదయం ఘటన స్థలాన్ని సంజామల పశుసంవర్ధక శాఖ ఏడీ మోహన్ రావు, ఎస్ఐ ప్రతాప్, డాక్టర్ రఘు బాలకృష్ణ పరిశీలించారు.